క్లుప్తంగా

సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

కలువాయి: మండలంలోని ఉయ్యాలపల్లె సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను నెల్లూరు జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్యాధికారి పెంచలయ్య ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించిన ఆ బృందం సభ్యులు అక్కడి సిబ్బంది పని తీరు, రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో జిల్లా గణాంక అధికారి కె.సహనా, డీపీఎంఓ ఎన్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



పంటను పరిశీలిస్తున్న ఏఓ

సైదాపురం: రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ హైమావతి పేర్కొన్నారు. మండలంలోని గిద్దలూరు, పరసారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో మంగళవారం ఎరువులు, పురుగు మందుల వినియోగం, పంట సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులను వాడకూడదన్నారు. తప్పని సరిగా వ్యవసాయాధికారులు సూచనలు పాటించాలన్నారు

క్రీడా కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ శివప్రసాద్

నాయుడుపేట: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో విజేతలకు మంగళవారం కిట్లను పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భావించారని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రతి ఉద్యోగి, యువత తప్పని సరిగా క్రీడల్లో పాల్గొనేలా చూడాలని పిలుపునిచ్చారని తెలిపారు. మండల స్థాయిలో విజేతలు, నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన కిట్లు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బేరిపేట సచివాలయ అడ్మిన్ బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 12.317 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 12.317 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకాలువకు 160 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



దక్కిలి: మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దక్కిలి వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దక్కిలి మండలంలో 589 స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద మంజూరైన రూ.3.71 కోట్లకు సంబంధించిన చెక్కును మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు.

ఆల్తూరుపాడు ఆపిన ఘనత ఆనందే

దక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను ఆపిన ఘనత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిదేనని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆనం పదే పదే తాను ఎమ్మెల్యేని అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దయతో ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే ఏడాది కాలం పాటు అడ్రస్ లేకుండా పోయి ఇప్పుడు వచ్చి ఏదో చేస్తానని చెప్పడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా ఖాయం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దక్కిలిలో మంగళవారం వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజారిటీ సాధించి తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడబోతోందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎం నారాయణరెడ్డి, సీహెచ్ శంకర్‌రెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసులు నాయుడు, బీ కృష్ణ, కే ప్రభాకర్ బాబు, ఆర్ చిరంజీవి, డీ రవీంద్రారెడ్డి, రాజమోహన్‌నాయుడు, డీపీ యాదవ్, వేణునాయుడు, వేణుగోపాల్, శ్రీహరిరెడ్డి, ఎస్ చెంచయ్య, బీ భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీపీ చెంచయ్య, మల్లిరెడ్డి, బీ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో మరో చరిత్ర

వెంకటగిరిరూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నవరత్న పథకాలు అమలు చేసి మరోచరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డీ శారద, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, విప్ పీ లక్ష్మి, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు ఏ శంకరయ్య, ఎం జానకిరామయ్య, ఎంఏ నారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు జే కామాక్షి, అల్లం మల్లీశ్వరి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి రూరల్: బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

ఎస్వీబీసీ చైర్మన్‌తో నేదురుమల్లి భేటీ

వెంకటగిరిరూరల్: వెంకటగిరి రాజా కుటుంబీకుడు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్రను వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. వారు రాజా ప్యాలెస్‌కు చేరుకుని డాక్టర్ వీబీ సాయి కృష్ణయాచేంద్రతో భేటీ అయ్యారు. సాయికృష్ణ యాచేంద్ర ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కొంతసేపు వెంకటగిరి అభివృద్ధిపై చర్చించారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



చిట్టమూరులో మేరిగ మురళీధర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

చిట్టమూరు: అందరూ సమష్టిగా పనిచేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రి చేసుకుందామని, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేద్దామని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. చిట్టమూరు మండలంలోని మల్లాం, చిట్టమూరు గ్రామాల్లో ఆయన మంగళవారం పలువురు నాయకులను కలిశారు. చిట్టమూరు, మల్లాం గ్రామానికి మేరిగ మురళీధర్ వస్తున్నారని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు సాదర స్వాగతం పలికారు. పలువురు నాయకులు, కార్యకర్తలు శాలువలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. అనంతరం దువ్వూరు శేషురెడ్డి, చెన్నారెడ్డి, బాబురెడ్డి, చిల్లకూరు వేణురెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డి, చుట్టి రవిని కలిసి, పలు విషయాలపై మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వీ రమణయ్య, కే సునీల్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ గురవయ్య, ఏ శ్రీనివాసులురెడ్డి, ఏ సుధాకర్, భాస్కర్, కందలి సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



సీఎం సందేశాన్ని వీక్షిస్తున్న అధికారులు, మహిళలు

సైదాపురం: నిరుపేద మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏపీఎం రాధమ్మ అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మొదటి విడతలో సైదాపురం మండలంలో 741 పొదుపు గ్రూపులకు రూ.5.20 కోట్లను ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిందని, రెండో విడతలో 745 గ్రూపులకు రూ.5.27కోట్ల, మూడో విడతలో 745 గ్రూపులకు రూ. 5.27 కోట్ల జమ చేసిందన్నారు. ప్రస్తుతం నాలుగో విడతలో 745 గ్రూపులకు రూ.5. 27 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నెల 25వ తేదీన సైదాపురంలో ఆసరా కార్యక్రమా న్ని నిర్వహించి, చెక్కులు అందజేస్తున్నట్లు ఏపీఎం రాధ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో మాజీ మంత్రి రాజ్యలక్ష్మి



నేదురుమల్లి రాజ్యలక్ష్మితో మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు

వెంకటగిరిరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి మంగళవారం వెంకటగిరిలోని తన కుమారుడు నేదురుమల్లి నివాసానికి చేరుకున్నారు. రాజ్యలక్ష్మమ్మ వచ్చిందన్న విషయం తెలుసుకున్న వెంకటగిరి మున్సిపాలిటీలోని కౌన్సిలర్లతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకుని, రాజ్యలక్ష్మమ్మతో మాటామంతీ కలిపి, గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలను పేరు పేరునా పలకరించి, ఫొటోలు తీసుకున్నారు. రానున్న ఎన్నికల్లో తమ కుమారుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని ఆదరించాలని కోరారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

పెళ్లకూరు: దేశంలో పేదల అభ్యున్నతే ప్రధాని మోడీ లక్ష్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం శిరసనంబేడులో జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మురళి, ఏపీఎం మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

రూ.4.80 కోట్ల నిధులు జమ

ఓజిలి: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు మహిళలకు రూ.4.80 కోట్లు వారి ఖాతాల్లో జమ అయినట్లు ఏపీఎం నిర్మలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 623 సంఘాల్లోని 5,896 మంది సభ్యులకు నాలుగో విడత నగదు జమ అయ్యిందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా పొదుపు మహిళలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ మొత్తం జమ చేశారని చెప్పారు.

ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు నేడు

గూడూరురూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. నియోజకర్గస్థాయిలో అన్ని మండలాల నుంచి ఐదు జట్లు చొప్పున పాల్గొంటాయన్నారు. వీరికి అవసరమైన అన్ని వసతులను కల్పించడంతో పాటు క్రీడా పోటీలను పర్యవేక్షించేందుకు పీడీలను నియమిస్తున్నట్లు తెలిపారు.

మీజూరులో జగనన్న సురక్ష



కంటి అద్దాలు అందజేస్తున్న అధికారులు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం: మండలంలోని మీజూరులో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. గతంలో దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించిన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురామయ్య పాల్గొన్నారు.

పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న శేషగిరిరావు

తిరుపతి కల్చరల్: అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవాసంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఇస్కాన్ మందిరం ఎదురుగా ఉన్న శ్రీకంచి పాదుక మండపంలో జాతీయ స్థాయిలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘం చైర్మన్ సీఆర్‌కే.శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 24 ఏళ్లుగా వివాహ వేదికతో పాటు ఉచిత షష్టిపూర్తి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ వేదికకు వైదిక, నియోగి, మధ్వ, వైష్ణవ, వైఖానస, అయ్యర్ శాఖలకు చెందిన వారంతా హాజరై తమ పిల్లల వివాహాలను కుదుర్చుకోవాలని కోరారు. బ్రాహ్మణ కుటుంబ సభ్యుల కోరిక మేరకు 28న ఉదయం పరిచయ వేదిక వద్ద స్పాట్ రిజిస్ట్రేషన్ అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యనిర్వాహక సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారానికి ఎంపిక

శ్రీకాళహస్తి : రాష్ట్రస్థాయి అంబేడ్కర్ ప్రతిభా పురస్కారానికి ఊరందూరు ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కూనాటి సురేష్ ఎంపికయ్యారు. సాంఘికశాస్త్రంలో పాఠ్య పుస్తక రచన, డిజిటల్ విద్య, టీచర్లకు శిక్షణ, కరదీపికలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. సాంఘికశాస్త్రానికి ఆయన చేసిన సేవలను గుర్తించి నిర్వాహకులు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 26న గుంటూరులో ఈ అవార్డును అందుకోనున్నారు.

నేడు జాతీయ బాలికా దినోత్సవం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని బాలికల పాఠశాలలు, బాలికల కళాశాలల్లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యు.శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు ఏర్పాటు చేసి సమాజంలో బాలికల పాత్రపై చర్చా కార్యక్రమం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలని సూచించారు. విజేతలకు ప్రశంసా పత్రం, నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా నేతాజీ జయంతి



నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

రాపూరు: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను రాపూరు మండలం సిద్ధవరం ప్రాథమిక పాఠశాల్లో మంగళవారం ఘ నంగా నిర్వహించారు. పాఠశాల్లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి హెచ్‌ఎం షకీల పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌస్‌మోహిదీన్ పాల్గొన్నారు.

కోట: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బీజేపీ నాయకులు కోట తూర్పువీధిలో ఉన్న ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌బాబు, వాసు, అంబరీష్, వెంకటేశ్వర్లు, వెంకయ్య పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత



మూసి వేసిన రైల్వేగేటు

సూళ్లూరుపేట: పట్టణంలోని రాఘవయ్యపేట రైల్వే గేటు మూడురోజుల పాటు మూసివేస్తున్నామని రైల్వే అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రైల్వేగేటు మరమ్మతు పనులు చేస్తున్న దృష్ట్యా మంగళవారం ఉదయం 10 గంటలకు మూసి వేశారు. బుధ, గురు వారాల్లో కూడా గేటు తెరవబోయమని వారు తెలిపారు. వాహన చోదకులు షార్ ఫ్లెటైవర్‌పైన రాకపోకలు సాగించాలని వారు కోరారు. అంతరాయానికి పట్టణ ప్రజలు సహకరించాలని వారు కోరారు.

ఎమ్మెల్యే చొరవతో చెరువులకు నీరు

శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో తొట్టంబేడు మండలం కంచనపల్లె, బోనుపల్లె చెరువులకు తెలుగుగంగ నీటిని విడుదల చేశారు. మంగళవారం ఎమ్మెల్యే కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ రెండు గ్రామాల చెరువుల్లో పంటలకు సరిపడా నీరులేక చివరిదశలో ఎండబెట్టుకోవాల్సి వస్తోందని ఇటీవల రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు పవిత్రారెడ్డి తెలుగు గంగ అధికారలను సంప్రదించి మాట్లాడారు. పంటలు ఎండకుండా ఉండేందుకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంజూరు పాళెం వద్ద ఉన్న సబ్ కెనాల్ గేట్లు ఎత్తడం ద్వారా కంచనపల్లె, బోను పల్లె చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పవిత్రారెడ్డికి రైతులు ఘనస్వాగతం పలికారు. నీటి విడుదలపై హర్షం వ్యక్తం చేశారు. వైస్సార్ సీపీ నాయకులు చంద్రయ్యనాయుడు, శ్రీరాములురెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, ధనుంజయరెడ్డి, గణేష్, గోవిందయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



ఎఫ్ఏ -3 పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ కృష్ణయ్య

దొరవారిసత్రం: నెలబల్లి ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ-3 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం జగనన్న గోరు ముద్ద పథకం, రికార్డులను తనిఖీ చేశారు.

నేడు మండల మీట్

తడ: మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఆమోసుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, నాయకులు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఎరువుల దుకాణంలో గూడూరు సహాయ సంచాలకులు డాక్టర్ గోపి, వెంకటగిరి ఏడీఏ నాగార్జునసాగర్ మంగళవారం తనిఖీలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఏఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ దర్శకుడు కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

బస్సుల సంఖ్య పెంచండి

రాపూరు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి నెల్లూరు వెళ్లే మార్గంలో బస్సులు సంఖ్య పెంచాలని పలువురు ప్రయాణికులు డయిల్ యువర్ డీఎం కార్యక్రమంలో కోరినట్లు డిపో మేనేజర్ అనిల్ కుమార్ తెలిపారు. డిపో మేనేజర్ కార్యాలయంలో మంగళవారం డయిల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపూరు-నెల్లూరు మార్గంలో ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు నుంచి రాపూరుకు ఉదయం ఒక బస్సు నడపాలని ఉద్యోగులు కోరారని చెప్పారు. అలాగే పెనుబర్తి నుంచి పెంచలకోనకు, గుండవోలు నుంచి రాపూరుకు ఒక బస్సు నడపాలని ప్రయాణికులు కోరినట్లు తెలిపారు.